ప్రజాశక్తి

సోమవారం 17 జూన్ 2024 | 5 | అనంతపురం



వెంకటాద్రిపల్లిలో సినిమా షూటింగ్



చిత్రీకరణలో పాల్గొన్న నటులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల పరిధిలోని వెంకటాద్రిపల్లిలో హిట్ మ్యాన్ అండ్ ప్రోమోష్ ప్రొడక్షన్స్ సినిమా యూనిట్ ఆదివారం సినిమా షూటింగ్‌ను ప్రారంభించింది. ప్రముఖ దర్శకుడు దేవా కట్ట దర్శకత్వంలో ఇంద్రప్రస్థ పేరుతో నిర్మిస్తున్న సినిమాలో ప్రముఖ నటులు ఆది పినిశెట్టి చైతన్య కష్ణ హీరోలుగా నటిస్తున్నారు. సినిమా ముఖ్య కథాంశం 1970-1980 లో జరిగిన రాజకీయ పరిమాణాల నేపథ్యంలో సినిమా తెరకెక్కిస్తున్నట్లు సినిమా ప్రముఖులు తెలిపారు. ఇందులో భాగంగా ఓ రైతు ఇల్లు, పురవీధుల్లో సినిమా షూటింగ్ సాగింది. సినిమా షూటింగ్‌ను చూసేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్రం యూనిట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అమాత్యా.. పెండింగ్ ప్రాజెక్టులు పట్టాలెక్కించేరా..?



నేడు జిల్లాకు రానున్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల ఘన స్వాగతానికి టిటిపి శ్రేణులు ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆర్థిక శాఖ మంత్రి అయ్యాక పయ్యావుల కేశవ్ తొలిసారిగా జిల్లాకు రానున్నారు. సోమవారం ఆయన రాక కోసం తెలుగుదేశం శ్రేణులు, ఆయన అభిమానులు పెద్దఎత్తునే స్వాగత ఏర్పాట్లు చేపట్టారు. చాలాకాలం తరువాత ఆయనకు ఈ కీలకమైన మంత్రి పదవి దక్కింది. అది కూడా ఆర్థిక శాఖయే కావడంతో జిల్లా అభివృద్ధి ఏ రకంగా పరుగులు పెట్టించగలరన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎందుకంటే జిల్లా సమస్యల పట్ల పూర్తి స్థాయి అవగాహన ఆయనకుంది. దీంతో ప్రధానంగా నిత్యం కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాకు సాగునీటి వనరులపై దృష్టి సారిస్తారన్న నమ్మకం ప్రజల్లో ఉంది. ఐదేళ్లుగా ప్రాజెక్టులన్నీ పెండింగులో ఉన్నాయి. ప్రధానంగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోనే పెండింగులో ఉండటం గమనార్హం. హంద్రీనీవా మొదటి దశ కింద ఆయకట్టుకు నీటిని అందించేందుకు వీలున్నది ఉరవకొండ నియోజకవర్గంలోనే. 2012వ సంవత్సరం నుంచి హంద్రీనీవా ద్వారా జిల్లాకు నీరొస్తున్నా ఆయకట్టుకు నీటిని అందించే పంట కాలువల నిర్మాణం పనులు పూర్తవలేదు. అవి పెండింగులో ఉంటూ వస్తున్నాయి. దీంతో నీరు కళ్లముందు పోతున్నా ఉరవకొండ నియోజకవర్గంలోని రైతులకు మాత్రం ఆయకట్టుకు నీరందటం లేదు. ఇక రూ.850 కోట్లతో చేపట్టిన సామూహిక బిందు, తుంపెర సేద్యం ప్రాజెక్టు అటకెక్కి ఐదేళ్లవుతోంది. టెండర్ల పున:పరిశీలనలోనే కాలమంతా గడిచిపోయింది. ఇది పూర్తయింటే సుమారు 50 వేల ఎకరాలకు సామూహిక బిందు, తుంపెర సేద్యం ద్వారా నీటిని అందించే వీలుండేది. ఇకపోతే జిల్లాలో భైరవాని తిప్ప ప్రాజెక్టు, పేరూరు ఎత్తిపోతల పథకాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. భూసేకరణ ఇప్పటికీ పూర్తవలేదు. దీంతోపాటు జిల్లాకు ప్రధానంగా సాగునీటిని అందిస్తున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి రోజురోజుకు తీసికట్టుగా మారుతోంది.తుంగభద్ర డ్యామ్ నుంచి నీటిని విడుదల చేసిన ప్రతీసారి ఎక్కడో ఒకచోట గండిపడటం నీరు వృధాగా పోవడం జరుగుతూనే ఉంటోంది. దీని ఆధునీకరణ పూర్తి చేయాల్సి ఉంది. పిఎబిఆర్ డ్యామ్ లీకేజీలతో పూర్తి స్థాయి సామర్థ్యంతో నింపలేని పరిస్థితి ఉంది. జీయోమెమ్రైన్ పద్దతులలో మరమ్మతులు చేపడితే పూర్తి స్థాయి సామర్థ్యంతో నింపే వీలుంటుంది. దీంతోపాటు జిల్లాలో పరిశ్రమలేవి లేవు. కియా పరిశ్రమ గత టిడిపి ప్రభుత్వ హయాంలో వచ్చింది. అది సత్యసాయి జిల్లాలో ఉంది. అనంతపురం జిల్లాలో తాడిపత్రి ప్రాంతంలో మినహా ఎక్కడా పెద్ద పరిశ్రమలన్నవి లేవు. అపారమైన ఖనిజ సంపద ఇక్కడున్నా వాటి ఆధారిత పరిశ్రమలు రావడం లేదు. ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పయ్యావుల కేశవ్ ఈ ప్రధానమైన సమస్యలకు పరిష్కారాలను ఏ మేరకు తీసుకురాగలరోనని జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. అందులోనూ కీలకమైన శాఖకు ఆయన మంత్రిగా ఉండటంతో ఆయన మార్కు జిల్లాలో చూపే ప్రయత్నం చేస్తారని ఆశిస్తున్నారు.



అధ్వానంగా ఉన్న హెచ్‌ఎల్‌సి



భైరవాని తిప్ప ప్రాజెక్టు

ప్రశాంతంగా సివిల్ సర్వీసెస్ పరీక్షలు

52.09 శాతం హాజరు
పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం జిల్లావ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాల్లో ఉదయం మధ్యాహ్నం రెండు సెక్షన్ల కింద పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 2795 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 1456 మంది హాజరుకాగా 1339 మంది గైర్హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 1462 మంది హాజరు కాగా 1333 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 1456 మంది హాజరు కాగా 1339 ముందుగా హాజరయ్యారు. మొత్తం 52.09 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. అనంతపురం జేఎన్టీయూ కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ పరిశీలించారు. ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలను జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పరిశీలించారు. మధ్యాహ్నం నిర్వహించిన కెఎస్ఎన్ డిగ్రీ బాలికల కళాశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు. అంతకు మునుపు జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్‌ను కలెక్టర్ తనిఖీ తనిఖీ చేసి సివిల్ సర్వీసెస్ పరీక్షల బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు. బుకింగ్ ప్రక్రియను పక్కగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, భూగర్భ జల శాఖ డిడి తిప్పే స్వామి, హెడ్ పోస్ట్‌మాస్టర్ బాల కుమార్, హెచ్‌ఎల్‌సి ఎస్సీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'అనంత' మేయర్‌కు అరుదైన అవకాశం

21న రష్యాలో జరిగే బ్రిక్స్ దేశాల మేయర్ల సదస్సుకు ఆహ్వానం

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగర మేయర్ మహమ్మద్ వసీం సలీంకు అరుదైన అవకాశం లభించింది. ఈనెల 21వ తేదీన రష్యాలోని జరిగే వివిధ దేశాలకు సంబంధించిన మేయర్లతో బ్రిక్స్ దేశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు అనంతపురం మేయర్‌కు ఆహ్వానం అందింది. ఈ సదస్సుకు వివిధ దేశాలకు చెందిన 50 మందికి పైగా మేయర్లు హాజరవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం అనంతపురం నగర మేయర్‌కు మాత్రమే ఈ సదస్సులో పాల్గొనడానికి ఆహ్వానం అందింది. రాను పోను ప్రయాణంతో పాటు అక్కడ బస చేయడానికి ఇతర అన్ని సౌకర్యాలను రష్యా ప్రభుత్వమే భరించనుంది.

అనంత నగర మేయర్ కే అవకాశం ఎందుకంటే..

అనంతపురానికి రష్యాతో ఉన్న చారిత్రాత్మక అనుబంధం వల్లే అనంతపురం నగరాన్ని ఎంపిక చేశారు. 16వ శతాబ్దంలో ప్రథమ రష్యన్ యాత్రికుడు అఫానసీ నికితిన్ విజయనగర సామ్రాజ్యంలో భాగమైన అనంతపురాన్ని సందర్శించాడు. ఈ సందర్శనకు సంబంధించినటువంటి అంశాల ప్రాధాన్యతను ఇటీవల కజాన్‌లో జరిగిన అసోసియేషన్ వ్యవస్థాపక సమావేశంలో గుర్తించారు. అందుకే భారతదేశం నుంచి పింక్ సిటీగా గుర్తింపు పొందిన జైపూర్, క్యాలీకట్,త్రిశూర్, నాగర్ కోయిల్‌తో పాటు అనంతపురం నగరాన్ని ప్రాతిపదికన తీసుకొని నగర ప్రథమ పౌరుడు అయిన మేయర్‌కు ఆహ్వానం పంపారు. ఎప్పుడో 16వ శతాబ్దంలో అనంతపురాన్ని సందర్శించిన రష్యన్ యాత్రికుని రచనలను పరిగణలోకి తీసుకొని అనంతపురం నగరాన్ని ఎంపిక చేయడం గర్వకారణంగా చెప్పుకోవచ్చు. ఇలాంటి అవకాశాల వల్ల చిరకాల సంబంధాలకు, సంస్కృతి, సాంప్రదాయాల మేళవింపులకు మరింత అవకాశం ఏర్పడుతుంది. రష్యాలో జరిగే సమావేశానికి అనంతపురం నుంచి మేయర్ వెళుతుండడంతో అంతర్జాతీయ స్థాయిలో అనంతపురం నగరానికి గుర్తింపు లభించినట్లైంది. రష్యన్ ప్రభుత్వం అనంతపురం నగరాన్ని గుర్తించిందంటే నగరంలోని ప్రజలు అందరి విజయంగా దీన్ని భావిస్తున్నానని మేయర్ వసీం తెలియజేశారు. ఈ సదస్సులో పాల్గొనడానికి తనకు అవకాశం దక్కడం చాలా ఆనందంగా ఉందన్నారు.



జెఎన్‌టియు ప్రొఫెసర్లకు జాతీయస్థాయి అవార్డులు

అభినందించిన వీసీ





జాతీయస్థాయి అవార్డులకు ఎంపికైన ప్రొఫెసర్లు ఈశ్వరరెడ్డి, చిత్ర

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియుకు చెందిన ప్రొఫెసర్లను జాతీయస్థాయి అవార్డులు వరించాయి. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టిఇ) జాతీయ స్థాయి 2023 అవార్డులకు అనంతపురం జేఎన్టీయూ ప్రొఫెసర్లు బి. ఈశ్వర్ రెడ్డి, విబి. చిత్ర ఎంపికయ్యారని అనంతపురం జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య జివిఆర్. శ్రీనివాస రావు తెలిపారు. ఈ అవార్డులను ఈనెల 26న భువనేశ్వర్‌లోని కలింగ ఇన్సిస్ట్యూట్ అఫ్ సోషియల్ సైన్సెస్, కలింగ ఇన్సిస్ట్యూట్ అఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కిట్) ఆధ్వర్యంలో జరిగే 53వ ఐఎస్‌టిఇ జాతీయ స్థాయి వార్షిక ఫ్యాకల్టీ సమావేశంలో వీరు అందుకోనున్నట్లు చెప్పారు. ఆచార్య బి. ఈశ్వర్ రెడ్డి అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్సు ఆచార్యులుగా, వర్శిటీ రీసెర్చ్, డెవలప్‌మెంట్ డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. ఈయన యూనివర్సిటీ నేషనల్ అవార్డ్ ఫర్ ది అవుట్ స్టాండింగ్ అకాడమిక్ టీచర్ క్యాటగిరిలో అవార్డును అందుకోనున్నారు. అదే విధంగా జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఇంగ్లీష్ ఆచార్యులు విబి. చిత్ర వర్శిటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈమె యూజీ విద్యాబోధనలో జాతీయ స్థాయిలో ఉత్తమ మహిళా అధ్యాపకులుగా మహమ్మద్ యూనిస్ మెమోరియల్ సంస్థ అందించే అవార్డుకు ఎంపిక అయినట్లు వీసీ తెలిపారు. ఈ అవార్డులు అందుకోనున్న ఆచార్యులను వీసీ ఆచార్య జివిఆర్. శ్రీనివాస రావు, రెక్టార్ ఆచార్య ఎం. విజయ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్ అభినందించారు.



ట్రాక్టర్‌తోసేద్యం చేస్తున్న రైతులు

ఖరీఫ్ సాగులో రైతుల బిజీబిజీ


ప్రజాశక్తి-బెలుగుప్ప

మండలవ్యాప్తంగా రైతులు ఖరీఫ్ సాగులో బిజీబిజీగా ఉన్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో దుక్కుల్లో నిమగ్నమయ్యారు. వేరుశెనగ, కంది, ఆముదం, ఉలవ, తదితర పంటలను సాగు చేసేందుకు రైతన్నలు ట్రాక్టర్లతో దుక్కులు చేసి సిద్ధం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 35,000 వేల ఎకరాల్లో పంట సాగయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా రైతులు కుమ్మర రామాంజనేయులు, గోవిందనాయక్ మాట్లాడుతూ ప్రధాన పంటలైన వేరుశెనగ, కంది, ఆముదంతోపాటు అంతర పంటలు సాగు చేయనున్నట్లు తెలిపారు. ఈసారి ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాలు కురవడంతో సాగుపై ఆఖలు చిగురించాయన్నారు. ఇకపోతే సాధరణంగా వేరుశెనగ సాగు చేయాలంటే ఎకరాకు దాదాపు రూ.3వేలు పెట్టుబడి వస్తుంది. కావున వేరుశనగ పంట సాగు చేయాలంటే భయపడాల్సి వస్తోందని వివరించారు. ఏదిఏమైనా వర్షాలు సకాలంలో కురవడంతో సాగు చేయక తప్పదన్నారు.

అమాత్యురాలిపై అభివృద్ధి ఆశలు

చారిత్రక పెనుకొండలో సమస్యల సవాళ్లు
పర్యాటక, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యత పెరిగేనా.?
మంత్రి సవితకు స్వాగతిస్తున్న సమస్యలు





పెనుకొండ ముఖద్వారం

పెనుకొండ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి బీసీ సంక్షేమ శాఖ మంత్రి అయిన సవితకు నియోజకవర్గ సమస్యలు పెనుసవాల్‌గా మారాయి. ప్రధానంగా పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగకల్పన, ప్రతిచెరువుకు నీరివ్వడం, పర్యాటక అభివృద్ధి, రాయల ఉత్సవాలు, పెనుకొండ కొండపై ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం వంటి అభివృద్ధి కోసం స్థానికులు ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో తాగు, సాగు నీటికోసం అనేక సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారు. రెండు దశాబ్దాలుగా చెరువుల కింద సాగు చతికిలపడింది. ఉపాధి కోసం వలసలే శరణ్యమయ్యాయి. పెనుకొండ పర్యాటక, పారిశ్రామికాభివృద్ధి, పెనుకొండ కొండపై దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్న ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం పూర్తైయితే వందలాది మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశాలున్నాయి. నిరుపేదలకు ఇంటి పట్టాలు, పక్కా ఇళ్ల నిర్మాణం, నియోజకవర్గంలో ఇంటింటికి తాగునీరు, సూపర్‌సిక్స్ పథకాల అమలు తదితర సమస్యలు నెరవేరుస్తారని ఎమ్మెల్యే, మంత్రి సవితపై ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు.

ప్రజాశక్తి - పెనుకొండ టౌన్

గత ప్రభుత్వం మరచిన రాయల ఉత్సవాలు

2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాయల పంచశతాబ్ధి ఉత్సవాలు ఘనంగా నిర్వహించింది. అప్పటి నుంచి ఏటా రాయల ఉత్సవాలు ప్రభుత్వం నిర్వహించేది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాయల ఉత్సవాల ఊసే లేదు. స్థానిక ప్రజలు ప్రతి ఏటా ఆగస్టు నెలలో ఉత్సవాలు నిర్వహిస్తారని ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం రాయల ఉత్సవాల నిర్వహణకు నిధులు కేటాయించనే లేదు. ప్రస్తుత తెలుగుదేశం అధికారం చేపట్టింది. ఇప్పుడైన రాయల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారని ప్రజలు ఆశగా ఉన్నారు.

పర్యాటక అభివృద్ధి జరిగేనా?

విజయనగర రాజుల రెండో రాజధాని పెనుకొండ చారిత్రక సంపద, కట్టడాలకు నిలయం. పర్యాటక అభివృద్ధికి 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పంచశతాబ్ధి ఉత్సవాల సందర్భంగా పలు హామీలిచ్చింది. ప్రధానంగా కొండ రోడ్డు నిర్మాణం, కొండపైన శిథిలమైన శ్రీలక్ష్మినరసింహాస్వామి దేవాలయం అభివృద్ధి, ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం, అతిథిగృహాల నిర్మాణం వంటి పనులు చేపట్టి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. ప్రస్తుతం కొండపైకి రోడ్డు నిర్మాణం పూర్తిఅయింది. ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. పట్టణంలో పలు చారిత్రిక కట్టడాలు ఆక్రమణల చెరలో ఉన్నాయి. వీటన్నింటిని అభివృద్ధి చేసి పెనుకొండకు పర్యాటక గుర్తింపు తీసుకురావాల్సి ఉంది. కియా కార్ల పరిశ్రమతో పెనుకొండకు ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చింది. ఈ నేపథ్యంలో పర్యాటక , పారిశ్రామిక అభివృద్ధికి మంత్రి సవిత కృషి చేయాలి.

చుట్టూ పరిశ్రమలున్నా యువతకు ఉపాధికరువు

దక్షిణ కొరియా కార్ల దిగ్గజం కియా కార్ల పరిశ్రమ జిల్లాకు వరం. ఈ నేపథ్యంలో జిల్లాలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఆశలు పెట్టుకుంది. ఈ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా 13 వేల మందికి ఉద్యోగావకాలు లభిస్తాయని ప్రభుత్వ ఒప్పందంలో కియా స్పష్టం చేసింది. అదే విధంగా కియా అనుబంధ సంస్థల్లో దాదాపు 10 వేల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని చెప్పారు. ఉపాధి అవకాశాల కోసం వేలాది మంది నిరుద్యోగ యువత ఎదురు చూస్తోంది. ఉద్యోగ నియామకాల్లో తొలి ప్రాధాన్యత జిల్లావాసులకే అంటున్నా సింహభాగం తమిళులే ఉన్నారు. భూములిచ్చిన కొందరు రైతులకు ఇప్పటికి ఉద్యోగ అవకాశాలు లభించలేదు.

హంద్రీనీవా పథకమే శరణ్యం

హంద్రీనీవా పథకంలో భాగంగా పెనుకొండ మండలం గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు అందించాలని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ముందడుగు వేసింది. గోరంట్ల మినహా పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం, పరిగి మండలాలకు అనుసంధానంగా నీరు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. అయితే వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చెరువులు నింపే ప్రక్రియ చేపట్టలేదు. చెంతనే రిజర్వాయర్ ఉన్నా నేటికీ అనేక చెరువులకు నీరు అందని పరిస్థితి. రొద్దం, పెనుకొండ, సోమందేపల్లిల్లో కొన్ని చెరువులకు మాత్రమే నీరు అందుతోంది. గోరంట్లకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు ఇచ్చే అవకాశం ఉంది.పెనుకొండ పట్టణంలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. పెనుకొండ కొండ వెనుక నుంచి హంద్రీనీవా కాలువ వెళ్లుతున్నా పట్టణానికి తాగునీటి సమస్య తీరలేదు. ఒక లిఫ్టు ఏర్పాటు చేస్తే పెనుకొండ చెరువుకు కృష్ణా జలాలు వచ్చే అవకాశం ఉంది. ఈ సమస్యపై మంత్రి దృష్టి సారించాల్సి ఉంది.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం: మంత్రి సవిత


నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. తెలుగుదేశం హయాంలోనే నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధిలో దూసుకు పోయిందన్నారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని మంత్రి వివరించారు.

నియోజవకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలు

- పట్టణ ప్రభుత్వాస్పత్రిలో ట్రామాకేర్, సీమాక్ సెంటర్లు ప్రారంభం. ఆస్పత్రి స్థాయి, సిబ్బంది పెంపు.
- పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, పరిగిలో గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటు
- కియా పరిశ్రమ వద్ద ఆర్వోబి నిర్మాణం త్వరిగతిన చేపట్టడం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల్లో లెక్చరర్ల కొరత,
- సోమందేపల్లిలో జూనియర్ కళాశాల, పెనుకొండలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు.
- పెనుకొండలో నిరుద్యోగ యువతకు నైపుణాభివృద్ధి శిక్షణా కేంద్రాల ఏర్పాటు.
- నియోజకవర్గంలో పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపడం, గ్రామాల్లో ప్రధాన, లింకు రోడ్ల నిర్మాణం.
- అర్హులైన నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం.
- నగరపంచాయతీ పరిధిలో అండర్ డ్రైనేజీ వ్యవస్థఏర్పాటు



గగన్‌మహల్



కొండపై శిథిలమైన శ్రీలక్ష్మినరసింహ స్వామి దేవాలయం



కియా కార్ల పరిశ్రమ

నేడు మంత్రి పయ్యావుల కేశవ్ రాక

ప్రజాశక్తి-వజ్రకరూరు



రాష్ట్ర ఆర్థిక శాఖ, శాసనసభా వ్యవహారాల శాఖామాత్యులు పయ్యావుల కేశవ్ సోమవారం జిల్లాకు రానున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా సరిహద్దు గుత్తి సమీపంలోని బాటలో సుంకులమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా గుత్తి, పామిడి, కల్లూరు మీదుగా అనంతపురంలోని జాతీయ రహదారి గుండా తపోవనంకు మధ్యాహ్నం 12.00 గంటలకు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి ఉరవకొండలోని అనంతపురం బళ్లారి హైవే పక్కన ఉన్న కేకే పెట్రోల్ బంకు దగ్గరకు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

టిడిపిలో పట్టున్న నాయకుడు 'పిట్టు'

పార్టీ అధికారం కోసం కష్టపడి పని చేసిన రంగారెడ్డి

ప్రజాశక్తి-నార్పల



మండల తెలుగుదేశం పార్టీలో బండ్లపల్లి పిట్టు రంగారెడ్డి మంచి పట్టు సాధించాడు. టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, నార్పల మండల కన్వీనర్ బండ్లపల్లి పిట్టు రంగారెడ్డి సేవలు అందించారు. పార్టీ అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. ఏమాత్రం పట్టు వదలకుండా పని చేసిన అసలు, సిసలైన నాయకుడు పిట్లు రంగారెడ్డి అని మండల నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. తన సామాజిక వర్గానికి చెందిన వారు, సమీప బంధువులు, స్నేహితులు వేరేపార్టీలో ఉన్నా.. స్నేహం, బంధుత్వం వేర్వేరు అని చాటి చెబుతూ రంగారెడ్డి టిడిపిలోనే కొనసాగుతూ మంచి పట్టు సాధించాడని చెప్పవచ్చు. పార్టీలకు, స్నేహానికి సంబంధం లేదు.. అని అందరితో సత్సంబంధాలు కొనసాగిస్తూ... ఎంతమంది ఎన్ని రకాలుగా వత్తిడి తెచ్చినా.. పార్టీ మారకుండా మండలంలో టిడిపి బలోపేతం కోసం నిస్వార్థంగా, నిర్విరామంగా కృషి చేస్తున్నారని చెప్పవచ్చు. టిడిపిలో రాష్ట్ర, జిల్లా నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ మండలంలో ఎన్ని అంతర్గత విభేదాలు ఉన్నా పార్టీకి అవసరమైనప్పుడు అందరూ నాయకులతో సానుకూల చర్చలు జరిపి ఏకతాటిపైకి తీసుకొచ్చే సమర్థుడు పిట్టు రంగారెడ్డి అని స్థానిక నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు.

జీవో 117ను తక్షణమే రద్దు చేయాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు

గ్రామీణ విద్యారంగానికి విఘాతం కలిగిస్తూ విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసిన జీవో నెంబర్ 117ను తక్షణం రద్దు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జీవో 117 రద్దుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. జీవోను రద్దు చేయడం ద్వారా పాఠశాలల విలీనం రద్దు అయి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అదేవిధంగా ఎన్నికల హామీ మేరకు 12వ పిఆర్‌సి అమలు ఆలస్యం అవుతున్నందున తక్షణమే ఐఆర్ ప్రకటించాలన్నారు. అదేవిధంగా సిపిఎస్ రద్దు చేసి ప్రత్యామ్నాయంగా ఒపిఎస్ మాత్రమే అమలు చేయాలని, రెండు మాధ్యమాల్లో బోధన కొనసాగించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా పూర్తి చేస్తూ నేటి ప్రభుత్వం విడుదల చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా ఉపాధ్యాయుల పని భారాన్ని తగ్గుతుందన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వాధ్యక్షులు ఎస్.రఘురామ్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు డి.ప్రభాకర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్‌సి.రాజుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆగిపోయిన తెలుగు, హిందీ, ఉర్దూ పాఠశాల సహాయకుల ప్రమోషన్లు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అనంతపురం జిల్లాలో ఆగిపోయిన ఆంగ్లభాషా సహాయకుల ప్రమోషన్లు తక్షణమే చేపట్టాలని కోరారు. అలాగే మానసిక వేదనకు గురిచేస్తూ ఎలాంటి ప్రయోజనం లేని అనేక యాప్‌ల భారాన్ని తగ్గించి ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడి లేని పని విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. వేలాది మంది ఉపాధ్యాయుల ఆర్థిక ఇబ్బందులతో దరఖాస్తు చేసుకున్న అన్ని రకాల లోన్లను క్లియర్ చేయాలని, తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. కెజిబివి, మోడల్ స్కూల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కల్పిస్తున్న సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా పూర్వ కార్యదర్శి బి.హనుమప్ప, జిల్లా ఉపాధ్యక్షులు దేశాయి నాగరాజు, డేనియల్, గాయత్రి, బొమ్మయ్య, భాస్కర్, సతీష్, ఉపాధ్యాయ సంపాదకులు నరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్‌వలి, రాష్ట్ర కౌన్సిలర్లు రమణ, తిప్పేస్వామి, పాతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ యువకుడికి ఎమ్మెల్యే 'దగ్గుపాటి' భరోసా

ఉద్యోగం, పింఛన్ ఇచ్చేందుకు హామీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


వికలాంగునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

నిస్సహాయ స్థితిలో ఉన్న పేద బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వికలాంగ యువకుడికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అండగా నిలిచారు. నగరంలోని పేద బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వాసుదేవశాస్త్రి పోలియో కారణంగా చిన్నతనంలోనే రెండు కాళ్లు కోల్పోయాడు. చిన్నప్పుడే తండ్రి మరణించడంతో తల్లి సహకారంతో ఎంఏ ఇంగ్లీష్ లిటరేచర్ చదివాడు. ప్రస్తుతం యువకుడు ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నాడు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిశారు. తనకు ఉద్యోగంతో పాటు పెన్షన్ సౌకర్యం, దివ్యాంగుల మోటార్ సైకిల్ కావాలని అభ్యర్థించాడు. ఈ సందర్భంగా వాసుదేవశాస్త్రిని దగ్గుపాటి ఆప్యాయంగా పలకరిస్తూ, కచ్చితంగా ప్రభుత్వ అధికారులతో మాట్లాడి పెన్షన్ సౌకర్యం, ద్విచక్ర వాహనం వెంటనే వచ్చేలా చూస్తానన్నారు. అలాగే ఉద్యోగ విషయంలో కూడా తనవంతుగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో యువకుడు సంతోషం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే 'దగ్గుపాటి'కి శుభాకాంక్షల వెల్లువ

అనంతపురం ఎమ్మెల్యేగా దగ్గుపాటి వెంకటప్రసాద్ గెలిచి 2 వారాలు కావస్తున్నా ఇంటి వద్ద కార్యకర్తల సందడి ఏమాత్రం తగ్గలేదు. రోజూ అర్బన్ కార్యాలయం వద్దకు వందలాదిగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు వివిధ శాఖల అధికారులు సైతం ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలుపుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ శుభాకాంక్షల వెల్లువ సాగింది. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒకరినీ ఆప్యాయంగా పలుకరించారు. డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు, ఆటోనగర్ కార్మికులు, ఎలక్ట్రికల్ ప్లంబర్ అసోసియేషన్ సంఘాల నాయకులు దగ్గుపాటిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది నా ఒక్కడి విజయం కాదని.. అందరం సమిష్టిగా పని చేయడం వల్లే సాధ్యమైందన్నారు. భవిష్యత్‌లో మనం ప్రజల కోసం బాధ్యతగా పని చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.


కలెక్టర్ దంపతులకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఆత్మా రామాలయంలో కలెక్టర్ దంపతుల పూజలు

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని ఆత్మారాముని దేవాలయాన్ని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఓబిరెడ్డి, నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ


కలెక్టర్‌కు పూల మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

కలెక్టర్ వినోద్ కుమార్‌ను అనంతపురంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్క అందజేశారు. అనంతరం నియోజకవర్గ ప్రజా సమస్యలపై చర్చించారు.

బక్రీద్ శుభాకాంక్షలు

వజ్రకరూరు : బక్రీదు పండుగ త్యాగానికి ప్రతీక అని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే పండుగ ముఖ్య సందేశం అన్నారు. బక్రీద్ నేపథ్యంలో ఉరవకొండ నియోజకవర్గంలోని ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కుర్బానీ ఇచ్చే ముస్లింలకు ఎంతో పుణ్యఫలం లభిస్తుందన్నారు. ఈ పండుగ త్యాగనిరతికి ప్రతీక అని, ఇతరుల పట్ల ప్రతి ఒక్కరు సోదర భావం చూపాలన్నారు. త్యాగం మనిషిని ఉన్నతుడిని చేస్తుందని దైవ పరీక్షలో కట్టుకున్న భార్యని వదిలి కన్న కొడుకు ప్రాణాలను బలిచ్చేందుకు సిద్ధపడిన మహనీయుడు త్యాగానికి గుర్తుగా ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటారన్నారు.

కుళ్లాయిస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే 'ఎంఎస్'

ప్రజాశక్తి-నార్పల


ఎమ్మెల్యే ఎంఎస్.రాజుకు బొకే అందజేస్తున్న అలంకరాయునిపేట వాసులు

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామిని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఇందులో భాగంగా కుళ్లాయిస్వామితోపాలు ఆంజనేయస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండి అన్నిరంగాల్లో అభివద్ధి సాధించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురి శుభాకాంక్షలు

శింగనమల : మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజును సొంతూరు మండల పరిధిలోని అలంకరాయునిపేట వాసులు భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా పుష్పగుచ్చాలు అందజేసి అభినందన లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలంకరాయునిపేట వాసులు జయ పాల్‌రెడ్డి, ఓబిరెడ్డి, నాగిరెడ్డి, రమ శివారెడ్డి, శివారెడ్డి, ఆంజన్‌రెడ్డి, ప్రతా ప్‌రెడ్డి, శ్రీరాములు, నడిఓప్ప, అదెన్న, నారాయణస్వామి, చిన్న ఓబిలేష్, సంజప్ప శ్రీనివాసులు, బాలగారి అదెన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి ఎంఆర్‌పిఎస్ నేతల అభినందన


ఎస్పీకి బొకే అందజేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో సాధారణ ఎన్నికల్లో ప్రశాంతంగా నిర్వహించినందుకు ఎస్పీ గౌతమిశాలిని జిల్లాకేంద్రంలోని ఛాంబర్‌లో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కమిటీ ఛైర్మన్ బిసిఆర్ దాస్ ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు నిర్వహించడం అంటే కత్తి మీద సాము లాంటిది అని, ఒక మహా యజ్ఞం మహాక్రతువు లాంటిది అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ఎలాంటి గొడవలు లేకుండా, రీ పోలింగ్ లేకుండా చేసిన ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు మీనుగ కుళ్లాయప్ప, ఓబుళపతి, రాము, పెద్దలయ్య, బాల నారాయణ, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా


ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

పుట్లూరు : పుట్లూరుకు చెందిన టిడిపి నాయకులు పుల్లారెడ్డి ఉచితంగా మూడు ట్యాంకులను ఏర్పాటు చేసి మండల కేంద్రంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నారు. గత కొన్ని నెలల నుంచి మండల కేంద్రంలో తాగునీటి సమస్య నెలకొంది. వైసిపి నాయకులు ఎన్నికల ముందు రోజు మార్చి రోజు ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసేవారు. అయితే ఎన్నికల ముగిసిన తర్వాత మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేశారు. టిడిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక ఐదు రోజుల నుంచి ఏడు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడడంతో స్పందించిన టిడిపి నాయకుడు పుల్లారెడ్డి ఆదివారం నుంచి మూడు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రజలు పుల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జీవితంలో అత్యంత ముఖ్యమైన వ్యక్తి నాన్న

ప్రజాశక్తి-పామిడి

బిడ్డను తల్లి తొమ్మిది నెలలు మోస్తే.. తండ్రి మాత్రం జీవితాంతం మోస్తాడని.. అలాంటి తండ్రి కోసమే ప్రత్యేకంగా ప్రతి సంవత్సరం జూన్ మూడో ఆదివారం ఫాదర్స్ డే నిర్వహిస్తారని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మన జీవితాల్లో అత్యంత ముఖ్యమైన వ్యక్తి నాన్న అన్నారు. మన జీవితాల్లో నాన్న కోసం ఏదైనా చేయగలిగితే అది మనకు గొప్ప విజయమన్నారు. మన జీవితాలను మెరుగుపరచడానికి నాన్న కృషి, త్యాగానికి ప్రతి కుమారుడు, కుమార్తె కృతజ్ఞతలు తెలియజేయాలన్నారు. అలాగే వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కుమారులు, కుమార్తెలు ఆదరించాలన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

ప్రజాశక్తి-నార్పల



త్యాగానికి ప్రతీకగా ముస్లిం సోదరులు నిర్వహించుకునే అత్యంత ముఖ్యమైన పండుగ బక్రీద్. ముస్లిం పెద్దల కథనం మేరకు అల్లాకు అత్యంత ప్రీతిపాత్రుడైన భక్తుడు ఇబ్రహీంకు చాలాకాలం తర్వాత అల్లా దయవల్ల కుమారుడు జన్మిస్తాడు. ఆ కుమారుడిని ఇస్మాయిల్ అనే నామకరణం చేసి ఇబ్రహీం అల్లారుముద్దుగా చూసుకుంటూ ఉంటాడు. ఒకరోజు ఇబ్రహీం నమాజ్ (ప్రార్థన) చేస్తున్న సమయంలో అల్లా ఇబ్రహీం భక్తిని (ఇమాన్) పరీక్షించడానికి నీ కుమారుడు ఇస్మాయిల్‌ను అల్లా పేరిట కుర్బానీ ఇవ్వాలని ఓ అదృశ్య వాణి వినిపించేలా చేస్తాడు. దానికి అనుగుణంగా ఇబ్రహీం తాను అల్లా ముద్దుగా పెంచుకున్న కుమారున్ని అరేబియా ఎడారికి తీసుకెళ్లి అల్లా పేరిట తన కుమారుడు ఇస్మాయిల్‌ను కుర్బానీ ఇవ్వడానికి సిద్ధపడతాడు. తాను అత్యంత ప్రేమగా పెంచుకున్న కుమారుడి ముఖాన్ని చూస్తూ ఎక్కడ అల్లా ఆజ్ఞను జవదాటుతానో అన్న భయానికి లోనైన ఇబ్రహీం తన కళ్లకు గంతలు కట్టుకుని కుమారుడిని అల్లా పేరిట కుర్బానీ ఇవ్వడానికి గొంతుపై కత్తి పెట్టి జుబా చేస్తాడు. అనంతరం బాధతో కళ్లకు గంతులు విప్పి చూడగా ఇబ్రహీం భక్తిని మెచ్చిన అల్లా అతని కుమారుని స్థానంలో ఒక గొర్రెను ప్రత్యక్షం చేసి ఉంటాడు. అప్పుడు ఇబ్రహీం అల్లాకు కృతజ్ఞతలు తెలుపుతూ నమాజ్ (ప్రార్థన) చేస్తారు. దానికి ప్రతీక ముస్లిం సోదరులందరూ బక్రీద్ పండగ రోజు పొట్టేలు, గొర్రెలను కుర్బానీ ఇచ్చి మిత్రులు, బంధువులు, పేదవారికి పంచి పెట్టడం ఆనవాయితీ. ముస్లిం సోదరులకు బక్రీద్ నెల ఎంతో పవిత్రమైందో.. అత్యంత పవిత్రమైన హజ్ యాత్ర కూడా ఈ మాసంలోనే చేస్తారు. అందుకే బక్రీద్ పండుగను త్యాగానికి ప్రతీకగా వర్ణిస్తారు.

నగరవనం పనులను త్వరగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం


మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

పట్టణంలోని నగరవనం పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని బళ్లారి రోడ్డులో గతంలో టిడిపి ప్రభుత్వం మంజూరు చేసి వైసిపి ప్రభుత్వం వచ్చాక ఆగిన నగరవనం పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇందులో భాగంగా మొక్కలను నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి హయాంలో నగరవనాన్ని మంజూరు చేస్తే పనులను ప్రారంభిస్తే తర్వాత అధికారంలోకి వచ్చాక జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పుడైనా అధికారులు నిలిచిపోయిన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. కాగా ఎన్నికల్లో సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ విడుదల చేయడం అభినందనీయమన్నారు. డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం ప్రజావేదిక వద్ద నియోజకవర్గ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

18 నుంచి ఐఎంసిటి పర్యటన

పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి : జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకూ జిల్లాలో ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసిటి) పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం క్యాంప్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం 2023-24 రబీ సీజన్‌లో జిల్లాలో నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయి సమావేశం కూడా ఇక్కడే ఉంటుందన్నారు. కావున ఇందుకు సంబంధించిన అన్ని రకాల నోట్స్ సిద్ధం చేయాలని, పంట నష్టపోయిన ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డిపిఎం ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, పబ్లిక్ హెల్త్ సతీష్‌రెడ్డి, తహశీల్దార్ శివరామిరెడ్డి, ఎడిఎలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కదిరిని అభివృద్ధి పథంలో నడిపిస్తా : ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హామీ ఇచ్చారు. ఆదివారం పట్టణ సమీపంలోని పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో కూటమి శ్రేణుల ఆత్మీయ సమావేశాన్ని ఎమ్మెల్యే కందికుంట ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు 20వేల మంది దాకా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఉద్యోగ పారిశ్రామికపరంగా మౌలిక వసతుల కల్పనలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని స్పష్టం చేశారు. అధికారమంటే చెలాయింపు కాదని ప్రజలు ఇచ్చిన అవకాశమని అన్నారు. ప్రజలకు మంచి చేస్తేనే భవిష్యత్తు ఉంటుందని భవిష్యత్తులో వారు మనల్ని ఎప్పుడూ ఆదరిస్తారని చెప్పారు. ఎన్నికల్లో కష్టపడిన వారందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు, పిసి భైరవ ప్రసాద్, మంచి శివశంకర్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వ కార్యదర్శి టీవీ పవన్ కుమార్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్ భాను, కౌన్సిలర్లు, టిడిపి మండల కన్వీనర్లు, చెన్నకేశవులు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ అంబికాకు బొకే అందజేసన్తున్న దండు శ్రీనివాసులు

ఎంపీ అంబికాను కలిసిన 'దండు'

శింగనమల : ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను అనంతపురంలోని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టిడిపి పనిచేసిన ప్రతి కార్యకర్తనూ గుర్తు పెట్టుకుంటామన్నారు. వారికి ఏ కష్టం వచ్చినా అండగా నిలబడతామని, ఏ విషయమైనా తన దృష్టికి తీసుకురావాలని భరోసా ఇచ్చారు.

నేరాలు ఘోరాలు


మద్యం వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

గోవా మద్యం పట్టివేత

వజ్రకరూరు : గోవా నుంచి ఆంధ్ర రాష్ట్రానికి తీసుకొస్తున్న మద్యం అక్రమ రవాణా వ్యవహారం ఆదివారం గుట్టురట్టయింది. విడపనకల్లు మండలం కరకముక్కల క్రాస్ వద్ద బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 80 బాక్సుల గోవా మద్యాన్ని సెబ్ అధికారులు పట్టుకున్నారు. గోవా నుంచి కర్ణాటక రాష్ట్రం మీదుగా కర్నూలు జిల్లాకు మద్యం అక్రమ రవాణా చేస్తున్నారన్న పక్కా సమాచారంతో సెబ్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో నిందితులు ఎవరికీ అనుమానం రాకుండా ఖాళీ అరటిపండ్ల బాక్సుల మధ్యలో రవాణా చేస్తుండగా రూ.10.50 లక్షలు విలువజేసే 80 బాక్సుల గోవా మద్యాన్ని పట్టుకున్నారు. ఇందులో 480 ఫుల్ బాటిళ్లు, 1920 క్వార్టర్ బాటిల్స్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మద్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ డీఎస్పీ శ్రీరామ్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఐదుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన కారు, మృతిచెందిన రమణారెడ్డి

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామ పరిధిలో ఉన్న బాట సుంకలమ్మ ఆలయ సమీపంలో ఉన్న 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పామిడికి చెందిన రమణారెడ్డి, తన కుమారులు నరసింహారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణారెడ్డి, కుమారులతోపాటు కారులో ప్రయాణిస్తున్న చైతన్య నిహల్య, చందన తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ద్విచక్ర వాహనదారుడు రమణారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.